# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 05-06-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని 'ఎక్ పేడ్ మా కే నామ్' కార్యక్రమంలో భాగంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు మొక్కలు నాటనున్నారు.**
2. **దేశవ్యాప్తంగా జనాభా, కుల గణన రెండు దశలలో జరగనునందని కేంద్ర హెూం మంత్రిత్వ శాఖ వెల్లడించింది.**
3. **కుటుంబానికో పారిశ్రామికవేత్త విధానంలో భాగంగా రాష్టంలో 175 ఎంస్ఎంఈ పార్కుల అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ మంత్రి వర్గం ఆమోదం తెలిపింది.**
4. **తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గం ఈరోజు సమావేశం కానుంది.**
5. **ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా బీఈడీ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎడ్‌సెట్ పరీక్ష ఈరోజు జరుగుతుంది.**

=========================

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా 'ఎక్ పేడ్ మా కే నామ్' కార్యక్రమంలో భాగంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈరోజు మొక్కలు నాటనున్నారు. ఢిల్లీల్లోని భగవాన్ మహావీర వణస్థలీ పార్క్ వద్ద మొక్కలు నాటనున్నారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. పర్యావరణ సమతూల్యతను కొనసాగించడంతో పాటు మొక్కలు నాటే సంస్కృతిని ప్రజలలో పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం 'ఎక్ పేడ్ మా కే నామ్' కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది.

--------------------------

దేశవ్యాప్తంగా జనాభా, కుల గణన రెండు దశలలో జరగనునందని కేంద్ర హెూం మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ గణనకు తాత్కాలిక షెడ్యూల్‌ను కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిదని పేర్కొంది. 2027 మార్చి 1 నుంచి దేశ వ్యాప్తంగా జనాభా గణనతో పాటు కుల గణన కూడా ప్రారంభంకానున్నది. అయితే జమ్ముకశ్మీర్, లడఖ్, ఉత్తరాఖండ్లో 2026 అక్టోబర్ నుంచే ఈ ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపింది. సాధారణంగా ప్రతి 10 సంవత్సరాలకు ఒకసారి జాతీయ గణన నిర్వహించి జనాభా రిజిస్టర్ (ఎన్పీఆర్)ను పునరుద్ధరిస్తారు. మరోవైపు షెడ్యూల్ ప్రకారం 2021లో జనాభా గణన చేపట్టాల్సి ఉంది. అయితే కరోనా మహమ్మారి కారణంగా ఇది వాయిదా పడింది.

--------------------------

జీరో పావర్టీ ప్రభుత్వ, ప్రైవేట్, వ్యక్తుల భాగస్వామ్యం–పీ4 లక్ష్యంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ లో 15 లక్షల కుటుంబాలను మార్గదర్శులు దత్తత తీసుకునేలా చూడాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. గుంటూరు జిల్లా ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో జీరో పావర్టీ పీ4పై సంబంధిత అధికారులతో నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రాజధాని నిర్మాణంలో 29 వేల మంది రైతులను భాగస్వాములు చేయడం ద్వారా వారికి సంపద సృష్టి జరిగేలా చేశామని చెప్పారు. ఇదే స్ఫూర్తితో ప్రతి బంగారు కుటుంబాన్ని దత్తత తీసుకుని వారి ఉన్నతికి కృషి చేసేలా చర్యలు తీసుకుకోవాలని సూచించారు.

---------------------------

కుటుంబానికో పారిశ్రామికవేత్త విధానంలో భాగంగా రాష్టంలో 175 ఎంస్ఎంఈ పార్కుల అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిన్న జరిగిన మంత్రివర్గ సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఆ వివరాలను సమాచార, ప్రజాసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్ధసారధి పాత్రికేయులకు వెల్లడిస్తూ .. అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ప్రపంచ రికార్డు నెలకొల్పే దిశలో చేపట్టే పనులకు వివిధ శాఖలు పిలిచిన టెండర్లకు మంత్రి వర్గం ఆమోదం తెలిపిందని చెప్పారు. ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం కింద శ్రీకాకుళంలోని ఉద్దానం, , చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో సురక్షితమైన నీరు అందించేందుకు ఏర్పాటుచేసిన ఆర్వో ప్లాంట్లకు నిధులు కేటాయింపుకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందని మంత్రి వివరిస్తూ,

వాయిస్..36 సెకన్లు

---------------------------

తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గం ఈరోజు సమావేశం కానుంది. హైదరాబాద్ లోని రాష్ట్ర సచివాలయంలో జరిగే సమావేశంలో రాజీవ్ యువవికాసం, వానాకాలంలో పంటలు, ఇందిరమ్మ ఇళ్లు, భూభారతి, ధాన్యం కొనుగోళ్లతో పాటు కాళేశ్వరంపై కమిటి ఇచ్చిన రిపోర్టుపై చర్చించే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అలాగే స్థానిక సంస్థల ఎన్నికలు సహా.. పలు అంశాలపై మంత్రి వర్గం చర్చించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని మంగినపూడి బీచ్ వద్ద మసులా బీచ్ ఫెస్ట్ –2025ను రాష్ట్ర ప్రభుత్వం ఈరోజు నుంచి నిర్వహిస్తోంది. ఈనెల 8వ తేదీ వరకూ నిర్వహించే ఈ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. సముద్రంలో కయాక్ ద్వారా ప్రయాణించే సీ కయాకింగ్, హెలీ రైడ్, పారా గ్లైడింగ్, స్పీడ్ బోట్, జెట్ సీ, బంగీ లాంటి క్రీడలను కూడా ఏర్పాటు చేశామని వివరించారు. ఈ క్రీడల్లో దాదాపు 2 వేల మంది జాతీయ స్థాయి క్రీడాకారులు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా ముసుల బీచ్ ఫెస్ట్ పర్యవేక్షణ అధికారి సాయి బాబు పాత్రికేయులతో మాట్లాడుతూ,

..వాయిస్.. 24 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా బీఈడీ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎడ్‌సెట్ పరీక్ష ఈరోజు జరుగుతుంది. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించే ఈ పరీక్ష కోసం 87 కేంద్రాలను ఏర్పాటు చేశామని సెట్ కన్వీనర్ ఏవీవీఎస్ స్వామి తెలిపారు. ఈ పరీక్షకు 17 వేల 795 మంది దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. అభ్యర్థులు తమకు కేటాయించిన కేంద్రాలకు మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాల్లోపు చేరుకోవాలని వివరించారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా కేంద్రంలోకి అనుమతించబోమని ఆయన స్పష్టం చేశారు.

---------------------------

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఈరోజు జరుపుకుంటున్నాం. ఎడారీకరణను ఆపడం, "ప్లాస్టిక్ కాలుష్యాన్ని జయిద్దాం" అనే ఇతివృత్తంతో ఈరోజు ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ప్రకృతిని పరిరక్షించవలసిన ఆవశ్యకత పట్ల ప్రజలలో అవగాహన కల్పించే ఉద్దేశంతో ఐక్య రాజ్య సమితి పిలుపు మేరకు ప్రతి ఏటా జూన్ 5వ తేదీన ఈ కార్యక్రమం జరుగుతోంది. విచక్షణా రహితంగా అడవుల నరికివేత, వాహనాలను, ప్లాస్టిక్‌ను ఇబ్బడిముబ్బడిగా వినియోగించడం, పంట భూముల్లో ఎరువుల వాడకం, చెట్ల పెంపకం విషయంలో నిర్లక్ష్యం వహించడం వంటి కారణాల వల్ల వాతావరణం కలుషితమై పర్యావరణ సమతూకం దెబ్బతింటోందని పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఒక్కరూ చెట్లను విరివిగా పెంచి వాహనాలను, విద్యుత్‌ను పరిమితంగా వినియోగించి ప్లాస్టిక్ వాడకాన్ని అరికట్టాలని, ఈ దిశగా అందరూ ఉద్యమించాలని పర్యావరణ వేత్తలు సూచిస్తున్నారు.

కాగా.... పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈరోజు రాష్ట్రవ్యాప్తంగా వనమహోత్సవాన్ని నిర్వహిస్తుంది.

---------------------------

తెలంగాణలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్-2025 షెడ్యూల్ పాఠశాల విద్యా శాఖ విడుదల చేసింది. ఈ నెల 18 నుంచి 30వ తేదీ వరకు పరీక్షలను నిర్వహించనున్నట్లు తెలిపింది. 9 రోజుల పాటు రెండు విడతల్లో పరీక్షలు జరగనున్నాయి. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల 30 నిమిషాల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల 30 నిమిషాల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. ఈ నెల 9వ తేదీ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని విద్యాశాఖ తెలిపింది. కాగా ఈసారి టెట్ పరీక్షకు లక్షా 83 వేల 653 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు.

---------------------------

ఇండియన్ ప్రీమియర్ లీగ్ ఐపీఎల్-2025 ట్రోఫీ గెలుచుకున్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు విజయోత్సవాలలో నిన్న జరిగిన తొక్కిసలాటలో 11 మంది మృతి చెందారు. మరో 33 మందికి తీవ్ర గాయాలయ్యాయి. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ప్రమాదంపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ విచారం వ్యక్తం చేశారు.

కాగా.. మృతి చెందిన వారికి రెండు లక్షల రూపాయలు, క్షతగాత్రులకు 50 వేల రూపాయల పరిహారాన్ని ప్రధానమంత్రి ప్రకటించారు.

---------------------------

దిగువ ట్రోపో ఆవరణంలో నైరుతి, పశ్చిమ దిశలో గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో రానున్న రెండురోజులపాటు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కొన్ని చోట్ల కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి జి. లక్ష్మి పేర్కొన్నారు.

======================